# ముసురు

ఆకాశమంతా మబ్బులు పట్టాయి పట్టపగలే చీకటిలా ఉంది.

ఉండుండి ఉరుములు మెరుపులు సన్నగా తుంపర పడుతోంది.

ఉదయం నుంచీ ఏ పనీ తోచటం లేదు అనుకుంది సుందరమ్మ.

బైట ప్రకృతే కాదు- ఆమె మనసుకి పట్టిన మబ్బుచీకట్లు, ఆలోచనలు జడివానలాగా, ఆమె మనస్సుకి మెదడుకి స్థిమితం ఉండనివ్వడం లేదు.

"ఏమైనాసరే నా కూతురికి ఈ చిన్న వయస్సులో పెళ్ళి జరగడానికి వీల్లేదు. హరిహరబ్రహ్మాదులు వచ్చి మీకు అండగా నిలబడ్డా సరే, నేను ఈ చిన్న వయస్సులో ఉన్న నా కూతురికి పెళ్ళి జరగనివ్వను. ఈ అన్యాయం జరగనివ్వను" ఇల్లంతా దద్దరిల్లేటట్లు కోపంతో వళ్ళంతా ఆవేశంతో ఊగిపోతూ గట్టిగానే అరిచింది.

అరుగుమీద వాలుకుర్చీలో కూర్చుని పేపరు చదువుతూన్న పరంధామయ్యా, హాల్లో నులకమంచంమీద మధ్యలో కూర్చున్న ముసలి అత్తగారూ, కొత్తగా కాలేజీలో చేరి పుస్తకాలు షెల్ఫులో అందంగా సర్దుకుంటూన్న శాంతా, సుందరమ్మ బాధామయమైన గావుకేకకి భయంతో అదిరిపడ్డారు. కాని ఎవరూ మాట్లాడలేదు. ఇల్లంతా మళ్ళీ నిశ్శబ్దం ఉండుండి పడుతూన్న జడివానకు జడిసి పంచచూరులో జేరిన పిచ్చుకల అరుపులు మాత్రం వినిపిస్తున్నాయి.

పెరట్లో జామిచెట్టు మీద చిలుక ఖయ్‌మని అరచి మరీ ఎగిరిపోయింది.

భర్త పరంధామయ్య తన మాటలు వినడని తెలుసు. తను అనుకున్నట్లే ఈ ఇంట్లో జరగాలనే పట్టుదలేకాని, ఈ ఆధునిక యుగంలో భార్యాభర్తా ఒక్కమాటగా ఆలోచించాలనేది బొత్తిగా తోచదు.

అందువల్లే కదా తనకీ బాధ! పైగా, ముసలి అత్తగారి పట్టుదల మరీ పెరిగిపోతోంది. "నేనుండగా శాంతకి మూడుముళ్ళు వేయించారంటే, నా చేత్తో అక్షింతలు వేసి, కళ్ళారా పెళ్ళి వేడుక చూసి మరీ కన్నుమూస్తాను'' అంటూ రోజుకి పది మారులైనా అంటుంది.

ఇంక ఇలాంటి పరిస్థితులలో, ఏ సంబంధమో తీసుకు వచ్చి, పెళ్ళి జరిపించేస్తారో ఏమో? మళ్ళీ భయంతో వెన్ను జలదరించింది సుందరమ్మకి.

"ఈ చిన్న వయస్సులో శాంతకి, ఇప్పటి నుంచీ పెళ్ళి చేస్తానంటారేమిటండీ? చిన్నతనపు సరదాలింకా తీరలేదు. చదువా- పూర్తికాలేదు. లోకంలోని సంగతులు, మంచిచెడ్డలు తెలియని మన శాంతకి ఇప్పుడే పెళ్ళి చేయవద్దండీ!'' అని అంటే, దాంతో పరంధామయ్యకి ఆ మాటలు వినేటప్పటికి కోపం తారాస్థాయిని అందుకుంది. "పెద్దవాళ్ళు చెప్పడం వినడం వాళ్ళంటే గౌరవం ఉండే. మాకు. ఇప్పటివాళ్ళకి అదేం లేదు ఇంట్లో అందరూ పెద్దలే. ఎవరికి ఏదితోస్తే అది చెపుతున్నారు. ఇకనుంచి అలా పీల్లేదు. శాంతకి వెంటనే పెళ్ళి జరిపించి తీరుతాను" అని పట్టుపట్టాడు. పరంధామయ్య.

పిల్ల పెళ్ళి ఇప్పుడు జరగడానికి వీల్లేదని పంతం పట్టింది సుందరమ్మ.

వారం రోజులుగా, ఆ ఇంట్లో ఇద్దరూ మాట్లాడుకోవడం లేదు. మొత్తం మీద పట్టుదలలు పెరిగాయి భార్యాభర్తల మధ్య. చివరికి పరిస్థితులు ఎలా మారుతాయా? అవి ఎలా మారుతాయో తెలియటంలేదు ఎవరికీను.

కూతురు చదువుకుంటూన్న గదిలోకి వెళ్ళింది సుందరమ్మ.

కుర్చీలో కూర్చుని పుస్తకంలోకి దృష్టిని సారించి ఎంతో ఆసక్తితో మరీ చదువుతోంది శాంత. సుందరమ్మ మనసుకి సంతోషమే కలిగింది కాని, వెంటనే మనసు విలవిలలాడింది. పట్టుమని పదహారేళ్ళు లేవు దీనికి? అప్పుడే పెళ్ళి చేయడమా, ముఖంలో అమాయకత్వం పోలేదు యవ్వనం ఛాయలు రానే లేదు. చదువుకుంటూ, చదువుకుంటూ, మధ్యలో తనచేతి వేళ్ళకి పెట్టుకున్న గోరింటాకు చూసుకుని ఎలా మురిసిపోతోందో? ఈ పసిదానికి అప్పుడే పెళ్ళా? భర్త, కాపురం, బాధ్యతలూనా? అనుకుంటూ సుందరమ్మ కిటికీ దగ్గరకు వెళ్ళి కిటికీలోంచి ఆరుబయటకు చూసింది. విచారంగా మనసు పరితపిస్తోంది. దూరాన పెద్ద పెద్ద చెట్లు, పంట పొలాలూ, కాలువ గట్లూ, ఎప్పుడూ చైతన్యవంతంగా ప్రవహించే కాలువలోని నీరూ కనిపిస్తున్నాయి.

సన్నని తుంపర పడుతోంది. మబ్బులు ఇంకా దట్టంగా వ్యాపిస్తున్నాయి.

అంత ముసురులోనూ నాగలికి లేగదూడల్ని కట్టి అరక దున్నుతున్నాడు వీరిగాడు. అవి బలంగా పరిగెట్టలేదని, ఆ నోరులేనివాటిని తన చేతికర్రతో భయపెడుతూ అదలిస్తున్నాడు.

ఆ బురదలో అవి నడవలేక తమ సత్తువ చాలక మెడలమీద నాగలి బరువుకి తట్టుకోలేక ముందుకీ వెనక్కీ గిజగిజలాడుతున్నాయి.

వాటి పరిస్థితి చూసేసరికి సరిగ్గా తన ఆశక్తత కూడా అలాగే ఉందనే వెర్రి బాధ పెల్లుబికి వచ్చింది. బేరుమని ఏడ్చేసింది. వస్తూన్న ఏడుపుని బైటకి వినిపించకుండా, పైటకొంగుని నోటికి అడ్డం పెట్టుకొని మరీ ఏడ్చింది సుందరమ్మ.

ఒక్కమారుగా దూరాన్నుంచి ఈదురుగాలి వచ్చింది. ఆ గాలి వళ్ళంతా తాకి, గుండెను కుదిపి, గతంలో సుందరమ్మ జీవితంలో సంగతులను మోసు కొచ్చింది. తను పట్టు పావడా వేసుకుని జరీ అంచు జాకెట్టు తొడుక్కుని బిగుతుగా అల్లిన జడలో సన్నజాజులు అందంగా తురుముకుని తనతోటి పిల్లలతో చెమ్మ చెక్కా ఒప్పులగుప్పా ఆడుకుంటోంది. ఆ రోజు తనకి ఇప్పటికీ జ్ఞాపకం. సన్నని నీరెండపడుతోంది. ఆ టైములో తమ వాకిట్లో జట్కావచ్చి ఆగింది. అంతక్రితం రోజున ఊరికి అని వెళ్ళిన తన తండ్రి, జట్కాలోంచి దిగాడు.

తండ్రిని చూసి సంతోషంతో బండి దగ్గరకు వెళ్ళింది తను

"నాన్నా నాన్నా, నాకేం తెచ్చావు? ఊరినుంచి బొమ్మలు తెచ్చావా?'' అని అడిగింది.

తన మాటలకు తండ్రి నవ్వుతూ తన గెడ్డాన్ని ముద్దుగా పుణికి మురిపెంగా చూస్తూ ''బొమ్మలేమిటమ్మా?....నీకూ....నీకూ, లోపలికి రా చెపుతాను'' అంటూ ఇంట్లోకి వెళ్ళాడు.

వెనకాలే ఇంట్లోకి వెళ్ళింది తను.

ఆవేళ తన తల్లీ, తండ్రి మాట్లాడుకున్న మాటలలోని సారాంశం ఇప్పటికీ తన చెవుల్లో రింగ్‌మంటున్నాయి.

"అమ్మాయికి పెళ్ళి ఖాయం చేసుకుని వచ్చాశానే" అన్న తండ్రి మాటకు—

"ఇప్పటినుంచీ దానికి పెళ్ళేమిటండీ? పట్టుమని పదేళ్లు లేవు. చూసి వస్తానని వెళ్ళి, పెళ్ళి ఖాయపరచుకుని వచ్చారేమిటండీ?" ఆవేదనతో అంది అమ్మ.

"నువ్వు, అర్చి గీపెట్టినా సరే, ఈ సంబంధం కుదిరిపోయింది. తాంబూలాలు కూడా పుచ్చుకుని మరీ వద్చాను" అంటూ, సింహంలాగా గర్జిస్తూ పైమీద కండువా ఒక్కమారు గట్టిగా దులిపి, వేసుకుంటూ, వీధిలోకి విసవిసా వెళ్ళిపోయాడు తండ్రి

అమ్మ తనని కావలించుకుని, "ఇప్పటినుంచే నీకు పెళ్ళి అంటున్నారే మీ నాన్న" అని ఏడ్చింది. "నీకు ఎన్నో విద్యలు చెప్పించాలని, అదదాని జీవితం కేవలం పిల్లల్ని కనే యంత్రంగా, అత్తవారింటికి చాకిరీ చేసే దాసిలా నీ చరిత్ర అవకూడదు అనుకున్నానే. నా ఆశలు అన్నీ నీతో తీరాలని అనుకున్నాను. అవి తీరే మార్గమే లేదని", కుమిలి కుమిలి ఏడ్చింది.

ఆ ఇంట్లో ఆమెకు ఏడవటానికి కూడా హక్కులేదు. ఆనాటి స్త్రీ బాధలు అలా ఉండేవి. నాన్న పట్టుదలే నెగ్గించుకున్నాడు. తన పెళ్ళి జరిగిపోయింది. తను అత్తవారింటికి వెళ్ళేటప్పటికి గంపెడు సంసారం, మరదుల చదువులు, ఆడబిడ్డల పెళ్ళిళ్లు, తన మీద, వారంతా చేసే ఆధారిటీలూ, అత్తగారి సాధింపులతో తను బాధపడి తన శక్తినంతా ఈ ఇంటికి ధారపోసింది. ఆ కనిపించే నాగలి బరువులాగే, లాగీలాగీ, జీవితంలో అలసిపోయారు తనూ, పరంధామయ్యానూ.

ఇప్పుడు మళ్ళీ తన కూతురికి కూడా ఈ పరిస్థితి రావడానికి వీల్లేదు.

ఆలోచనలతో తాను ఎక్కడ ఉందో తెలియలేదు సుందరమ్మకి.

"ఆ.... ఏరా? పొలం దున్నడం ఎంతవరకూ వచ్చింది?" అని అడిగాడు పరంధామయ్య.

"బాబుగారూ, దండాలండి. ఈ ముసురులో మీరు పొలం ఎందుకు వచ్చారు, అవసరం అంటే నేనే వద్దును కదండీ!"అన్నాడు పీరిగాడు, వినయంగా చేతులు ఎత్తి నమస్కరిస్తూను.

"సాయంకాలానికి అరక దున్నడం పూర్తిచేయాలి, పని తొందరగా కానీ," అన్నాడు పరంధామయ్య.

"బాబుగారూ, ఏం చెప్పమంటారు? నాగలి లాగలేక, ఆ లేగదూడలు, ఏక, ఏసట పడిపోతున్నాయండీ! అప్పుడే నాగలికి కట్టే పాటి వయస్సు రాలే

దండి. ఎలా రొప్పుతున్నాయో చూడండి బాబయ్యా!" అన్నాడు జాలిగా వాటికేసి చూస్తూను, పాలేరు వీరిగాడు.

పరంధామయ్యకి వాటి పరిస్థితి చూసేటప్పటికి మనసంతా జాలితో నిండి పోయింది. ''పాపం నిజమేరా!" అంటూ నిట్టూర్పు విడిచి, "ఇంకా ఇవి లేగ దూడలు సరే, అయితే, రెడ్డిగారి పొలం వెళ్ళి నేచెప్పానని చెప్పి, వాళ్ళ ఎడ్లను తోలుకురా, సాయంకాలానికి అరక దున్నడం పూర్తి చెయ్యాలి'' అని చెప్పాడు.

ఇంటివేపు బయలుదేరుతున్న పరంధామయ్యకి ఒక ఆలోచన వచ్చింది. "అమ్మాయి శాంత పెళ్ళి ఇప్పుడే చేద్దామనుకుంటున్నాను. కానీ చిన్నపిల్ల, సంసారం బాధ్యతలకి తట్టుకోలేదు. పెళ్ళైంది లగాయితూ కాన్పులూ, పిల్లలూ జంజాటాలతో, బాధపడుతుందేమో, ఇంతవరకూ ఆలోచించాను కాదు. అమ్మ ఉండగా పిల్ల పెళ్ళి చేయాలని అనుకున్నాను. వెంటనే సుందరికి ఈ మాట చెప్పాలి" అని ఇల్లు చేరుకున్నాడు పరంధామయ్య.

భార్య సుందరమ్మ భుజం మీద చెయ్యి వేశాడు. ఆ స్పర్శకి పులకించి, ఒక్కసారిగా ఆమెలో చైతన్యం వచ్చింది. వెంటనే భర్త ముఖంలోకి చూసింది నవ్వుతూ. ఇదివరకటి కోపంలేదు. ప్రసన్న వదనంతో చూసింది. ఆప్యాయంగా అతని చేతిని తన భుజంమీద నుంచి తీస్తూ, ''ఏమండీ?" అంది సుందరమ్మ.

"నువ్వు అన్నదీ నిజమే, అమ్మాయికి యుక్తవయసురాందే పెళ్ళి చేయ కూడదనీ, డిగ్రీ చదువు పూర్తిచేయనివ్వాలనీను తన జీవితాన్ని ఆదర్శంగా దిద్దు కొనే ఊహ వచ్చాక అప్పుడు పెళ్ళి చేద్దాం''అన్నాడు పరంధామయ్య.

భర్తలో వచ్చిన పరివర్తనకు సుందరమ్మ మనసులోని చీకటి తొలగింది.

ప్రకృతిలో మబ్బు చీకట్లు తొలిగాయి. ముసురు తగ్గింది. సూర్యరశ్మి కనిపిస్తోంది. ఆ ఇంట్లోని వారి మనస్సులో లాగానే ప్రకృతిలో కూడా చైతన్యం వచ్చింది. జరిగినదంతా విన్న శాంత మనస్సు పురివిప్పిన నెమిలిలాగా ఆడింది. తన ఆశయాలు తీరుతాయనే ఆశాకిరణం మనస్సులో తళుక్కుమంది. *

—రేడియో